సుస్థిరాభివృద్ధికి సైన్సే సోపానం

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



ప్లకార్డు ప్రదర్శిస్తున్న విద్యార్థిని


ర్యాలీగా ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు వెళ్తున్న ఏయూ విద్యార్థులు

ఏయూక్యాంపస్: సుస్థిరమైన భవిష్యత్‌కు శాస్త్రవిజ్ఞానం దోహదపడుతుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఏయూలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా జియోఫిజిక్స్ విభాగంలోని సి.వి.రామన్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం పరిపాలన భవనం వద్ద విద్యార్థుల ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని సైన్స్ ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ.. బీచ్‌రోడ్డులోని కన్వెన్షన్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ నిర్వహించిన సమావేశంలో విద్యార్థులనుద్దేశించి వీసీ మాట్లాడారు. యువత నిరంతర అభ్యాసకులుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. యంత్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థగా నేడు ప్రపంచం మార్పు చెందుతోందని, దీనికి అనుగుణంగా యువత సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. సునిశిత పరిశీలన, అవగాహన, ఆచరణ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యా రంగానికి అపారమైన నిధులు, ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని వెల్లడించారు. కోర్సుల రూపకల్పన, ప్రయోగశాలల ఆధునీకీకరణ, ఇంటర్న్‌షిప్‌లు కల్పన, స్టార్టప్ వ్యవస్థలను అభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలకు చేపడుతున్నట్లు తెలిపారు. ఎడ్‌ఎక్స్ కోర్సులను రాష్ట్ర యువతకు ఉపయుక్తంగా ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ మాట్లాడుతూ మీ వైఖరులే మీ భవిష్యత్ ప్రగతిని నిర్దేశిస్తాయన్నారు. వర్సిటీ వసతులను సద్వినియోగం చేసుకుంటూ.. ఆలోచనలకు కార్యరూపం ఇవ్వాలన్నారు. మీలోని సామర్థ్యాలను పూర్తిస్థాయిలో వెలికితీయాలని విద్యార్థులకు సూచించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ 25కి పైగా పేటెంట్‌లు దాఖలు చేశామని, 82 శాతం విద్యార్థులకు గతేడాది ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. ఏయూలో 9 ఏళ్లకు పైగా సి.వి రామన్ విధులు నిర్వర్తించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాళ్లు అనురాధ కామేశ్వరి, సంధ్య దీపిక, పాలక మండలి సభ్యురాలు ఆచార్య పి.సునీత, ఏయూ కళాశాలల ప్రిన్సిపాళ్లు వై.రాజేంద్ర ప్రసాద్, టి.శోభశ్రీ, ఎస్.కె భట్టి, జి.శశిభూషణ రావు, విభాగాధిపతులు పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఎంవీవీ పాదయాత్రకు 50 రోజులు

ఆరిలోవ: విశాఖ ఎంపీ, వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ప్రారంభించిన పాదయాత్ర మంగళవారం నాటికి 50 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా జీవీఎంసీ 12వ వార్డులో మంగళవారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, పార్టీ స్థానిక నాయకులతో కలసి ఆయన సింహగిరికాలనీ, వినాయకనగర్, పెదగదిలి తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధి గురించి ఆరా తీశారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రభుత్వం పాలన పట్ల అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అందుకే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. వైల్డ్‌లైఫ్ వార్డెన్ సత్తి మందారెడ్డి, స్థానిక నాయకులు పతివాడ కనకరాజు, బొండా శ్రీనివాసరావు, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, కన్నేటి సుబ్బారెడ్డి, కొండమ్మ, కనకరాజు, రమణ, హుస్సేన్, సుజాత, ఇజ్జాడ సత్యనారాయణ, సూర్యారావు, ధనలక్ష్మి పాల్గొన్నారు.


ఆదర్శనగర్‌లో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ, కార్పొరేటర్ రోహిణి

3న పల్స్‌పోలియో

మహారాణిపేట: మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లల కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో 2,08,163 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తామన్నారు. 1002 పోలియో కేంద్రాలు, 74 మొబైల్ బృందాలు, 32 ట్రాన్సిట్ కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలో 6,51,702 ఇళ్లను మార్చి 4,5 తేదీల్లో పరిశీలించి ఏ కారణం చేతనైనా పోలియో చుక్కలు వేసుకోని చిన్నారులుంటే అటువంటి వారికి ఇంటి వద్దే పోలియో చుక్కలు వేస్తామన్నారు. జిల్లాలో 2,65,820 డోసుల వ్యాక్సిన్ అందుబాటులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రశాంతి, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ మురళీకృష్ణ, వైద్యులు జగదీష్ ప్రసాద్, మురళీకృష్ణ, రవిశంకర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.


పల్స్ పోలియో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

క్లుప్తంగా

వసతి గృహాల్లో పోలీసుల తనిఖీలు


దుస్తులను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వసతి గృహాల్లో సోమవారం అర్ధరాత్రి పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఇటీవల ఏయూ హాస్టళ్లలోకి అనధికార వ్యక్తులు ప్రవేశించడం, వారి వద్ద అనుమానిత ప్యాకెట్ లభించిన నేపథ్యంలో పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి వర్సిటీ ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్ కళాశాలల్లో హాస్టల్ గదులను పరిశీలించారు. దాదాపు 30 మందికిపైగా పోలీసులు ఈ సోదాల్లో పాల్గొన్నట్లు తెలిసింది. అయితే వారి తనిఖీల్లో ఎటువంటి అనుమానిత వస్తువులు లభించలేదు. బయటి వ్యక్తులు కూడా ఎవరూ లేరని పోలీసులు నిర్ధారించారు.

ఉత్సాహంగా సత్యసాయి స్కూల్ వార్షికోత్సవం


స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీ సెక్టార్–8లోని శ్రీ సత్యసాయి విద్యా విహార్ స్కూల్ వార్షికోత్సవం మంగళవారం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు రూపొందించిన నమూనాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలతో చిన్నారులు అలరించారు. స్కూల్ ప్రిన్సిపాల్ అయ్యగారి కౌసల్య, స్కూల్ పూర్వ విద్యార్థిని కల్యాణి పొన్నగంటి, శ్రీ సత్య సాయి సేవా సంస్థల విశాఖ జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు అతిథులుగా పాల్గొని వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులు అందజేశారు.

36 కిలోల గంజాయి స్వాధీనం

ఆరిలోవ: కారులో గంజాయి తరలిస్తున్న ఓ యువకుడిని ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ గోవిందరావు తెలిపిన వివరాలివీ.. సోమవారం రాత్రి పోలీసులు తనిఖీ చేస్తుండగా.. ముడసర్లోవ డంపింగ్ యార్డు వద్ద ఓ కారు ఆగి ఉండడం గమనించారు. అందులో ఓ యువకుడు ఒంటరిగా ఉన్నాడు. దీంతో అనుమానం వచ్చి.. ఆ కారును తనిఖీ చేశారు. కారు డిక్కీలో 36 కిలోల గంజాయిని గుర్తించారు. దీంతో ఆ యువకుడిని విచారించగా.. ఢిల్లీని వచ్చి ఇక్కడ గంజాయి కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. గంజాయి, కారును పోలీసులు స్వాధీనం చేసుకుని.. యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. బుధవారం సాయంత్రం రూరల్ తహసీల్దార్ ఎస్.శివన్నారాయణ ముందు అతన్ని హాజరుపరిచారు.

తీరానికి కొట్టుకొచ్చిన బోటు శిథిలాలు


కొట్టుకొచ్చిన బోటు

బీచ్‌రోడ్డు: సముద్రంలో ప్రమాదానికి గురైన ఫిషింగ్ బోటు శిథిలాలు తీరానికి కొట్టుకొచ్చాయి. అలలు తీవ్రంగా ఉండటంతో సముద్ర గర్భంలో ఉన్న ఈ బోటు ఫ్లోటింగ్ బ్రిడ్జి ఉన్న ప్రాంతంలోకి వచ్చింది. దీనిని చూసేందుకు సందర్శకులు ఆసక్తి చూపించారు.

ఆలయ అభివృద్ధికి ఎంపీ ఎంవీవీ సహకారం

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు పరిధి తోటగరువు దరి బి.ఎస్.ఆర్.నగర్‌లో వరసిద్ధి వినాయక దుర్గా పోలమాంబ ఆలయం అభివృద్ధికి విశాఖ ఎంపీ, వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ఆర్థిక సహకారం అందించారు. ఆలయంపై ఇంతవరకు ఉన్న రేకుల షెల్టర్‌కు బదులుగా కాంక్రీట్ స్లాబ్ వేయడానికి ఆయన రూ.20 లక్షల సొంత నిధులు అందించి.. మంగళవారం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. విద్యా విభాగం డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి, పార్టీ స్థానిక నాయకులు బొండా శ్రీనివాసరావు, మొల్లి వెంకటరమణ, పతివాడ కనకరాజు, గోవింద్, చంద్రమౌళి, శ్రీనివాస్, సూరిబాబు, అప్పలనాయుడు పాల్గొన్నారు.


బి.ఎస్.ఆర్ నగర్‌లో ఆలయం నిర్మాణ పూజల్లో పాల్గొన్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

29 వరకు మానసిక వైద్య శిబిరం నిర్వహణ

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం సైకాలజీ విభాగంలో సైన్స్‌డేని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక ఆరోగ్య పరీక్షల శిబిరం జరిగింది. దీనిని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రజల మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించే బాధ్యతను సైకాలజిస్టులు తీసుకోవాలన్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి తగిన ప్రాధాన్యమివ్వాలని సూచించారు. మానసిక ఆరోగ్య పరిరక్షణపై ప్రజలకు తగిన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 29 వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విభాగంలో వివిధ మానసిక ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎండీ ఎస్.దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వడ్డాదికి డాక్టరేట్


ఉత్తర్వులు స్వీకరిస్తున్న మధుసూదనరావు

ఏయూక్యాంపస్: రాష్ట్ర రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూధనరావు ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో డాక్టరేట్ అందుకున్నారు. ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.వి జయలక్ష్మి పర్యవేక్షణలో 'లీగల్ స్టేటస్ అండ్ స్టాండర్డ్ ఆఫ్ మైగ్రెంట్ వర్కర్స్ ఇన్‌జనరల్–అండ్ ప్రీ అండ్ పోస్ట్ కోవిడ్–19 పీరియడ్ ఇన్ స్పెసిఫిక్(ఏ సోషియో లీగల్ స్టడీ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు విశాఖపట్నం డిస్ట్రిక్ట్) అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి మంగళవారం ఆయన డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరించారు. కోవిడ్‌కి ముందు, తర్వాత వలస కార్మికులు ఎదుర్కొన్న ఇబ్బందులను తన పరిశోధనలో చర్చించారు. మధుసూదనరావు ఎంఎంటీసీ లిమిటెడ్‌లో 27 ఏళ్ల పనిచేసి సీనియర్ మేనేజర్‌గా స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని రాష్ట్ర రెల్లి కులాల సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ ఇసుకపల్లి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

వయోవృద్ధులకు ఉచితంగా ఉపకరణాలు

జాలరిపేటలో పేర్ల నమోదు

ఎంవీపీకాలనీ: రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకంలో భాగంగా వయోవృద్ధులకు ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేసేందుకు మంగళవారం పేర్లు నమోదు చేశారు. జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జాలరిపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖాధికారి జె.మాధవి, జీవీఎంసీ ఏపీడీ దుర్గాప్రసాద్ కార్యక్రమంలో పాల్గొని 60 ఏళ్లు దాటిన వారి పేర్లు నమోదు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అలింకో, జిల్లా అధికార యంత్రాంగం సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అర్హులైన వయోవృద్ధులకు కళ్లజోళ్లు, చెవి వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్, ఊత కర్రలు, చంక కర్రలు, కృత్రిమ దంతాలు, ట్రైపాడ్స్ వంటి ఉపకరణాలను ఉచితంగా అందిస్తామన్నారు. వయోవృద్ధుల పేర్ల నమోదుకు నగర వ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరం సమన్వయకర్త రూపాకుల రవికుమార్ పాల్గొన్నారు.


శిబిరంలో పేర్లు నమోదు చేయించుకుంటున్న వృద్ధులు

తప్పుడు వార్తలు నమ్మొద్దు

తాటిచెట్లపాలెం : రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్)లో కానిస్టేబుళ్లు, ఎస్ఐల రిక్రూట్‌మెంట్ పేరిట వివిధ మాధ్యమాల్లో ప్రసారమవుతున్న తప్పుడు వార్తలను నమ్మొద్దని రైల్వే బోర్డు డీజీ శ్రీకా మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీయూ ఎగ్జామ్‌నెట్ వెబ్ సైట్‌లో ఆర్పీఎఫ్‌లో 4208 కానిస్టేబుళ్లు, 452 సబ్ ఇన్‌స్పెక్టర్స్ రిక్రూట్‌మెంట్ జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోందని, దీనిలో ఎంతమాత్రం వాస్తవం లేదని తెలిపారు. ఇటువంటి నోటిఫికేషన్ ఏదీ రైల్వే శాఖ జారీ చేయలేదని, ఎవరూ నమ్మొద్దని రైల్వే బోర్డు అధికారులు విజ్ఞప్తి చేశారు.

వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

రూ.77లక్షలతో మురుగు నీటి పైపులైన్ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెం పరిధిలోని శిథిలావస్థలో ఉన్న మురుగునీటి పైపులైన్ల పునరుద్ధరణ పనులకు మంగళవారం మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో శిథిలావస్థలో ఉన్న పైపులైన్ మార్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. రూ.77.20 లక్షల వ్యయంతో ఇక్కడ మురుగునీటి పైపులైన్ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గడిచిన ఐదేళ్ల కాలంలో నగరంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి పార్కులు, ప్రధాన రహదారులు, తీర ప్రాంతాలను తీర్చిదిద్దామన్నారు. అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.


శంకుస్థాపనలో పాల్గొన్న మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎంపీ ఎంవీవీ

ఎఫర్ట్ వార్షిక సదస్సుకు అపోలో వైద్యుడి కథనాలు

ఆరిలోవ: యూరోపియన్ ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ అసోసియేషన్స్ ఆఫ్ ఆర్థోపెడిక్ అండ్ ట్రామాటాలజీ(ఈఎఫ్‌వోఆర్‌టీ) సదస్సుకు అపోలో వైద్యుడు డాక్టర్ డిఖాన్ చేసిన సర్జరీలకు సంబంధించిన రెండు శాస్త్రీయ కథనాలు ఆమోదం పొందాయి. జర్మనీలోని హాంబర్గ్‌లో మేలో ఈఎఫ్‌వోఆర్‌టీ(ఎఫర్ట్) వార్షిక సదస్సు జరగనుందని డాక్టర్ డిఖాన్ తెలిపారు. దీనికి సంబంధించి ఈఎఫ్‌వోఆర్‌టీ నుంచి లేఖ అందినట్లు ఆయన వెల్లడించారు. హగ్లండ్స్ వైకల్యం చికిత్సలో భాగంగా హిండ్‌ఫుట్ ఎండోస్కోపిక్ కాల్కానియోప్లాస్టీ విధానంలో శస్త్రచికిత్స చేసినట్లు చెప్పారు. ఈ వివరాలతో పంపించిన శాస్త్రీయ కథనాలు ఈఎఫ్‌వోఆర్‌టీ సదస్సుకు ఎంపికయ్యాయన్నారు. ఈ పద్ధతిలో శస్త్రచికిత్స చేయడం రాష్ట్రంలోనే మొట్టమొదటిదన్నారు. ఈ సందర్భంగా ఆయన్ని అపోలో వైద్యులు అభినందించారు.


శస్త్రచికిత్స చేస్తున్న డిఖాన్(ఫైల్)

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు, ఈవో పి. శ్రీనివాసుల రెడ్డి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే విజయం సాధ్యం



అవగాహన సదస్సులో పాల్గొన్న కృష్ణా డిగ్రీ కళాశాల విద్యార్థులు

బీచ్‌రోడ్డు: జాతీయ సేవా పథకం ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా వి.ఎస్.కృష్ణా డిగ్రీ కళాశాలలో 'విద్యార్థులు ఒత్తిడిని జయించడం' అనే అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ ఎస్ఎల్ శంకర్ శాస్త్రి పాల్గొని విద్యార్థుల్లో ప్రేరణ కలిగించారు. ఎవరూ ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికా బద్ధంగా ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను చదివితే తప్పకుండా విజయం సాధిస్తారన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

స్క్రాప్ దుకాణదారుల ఇష్టారాజ్యం

ఏయూ స్థలంలో వ్యర్థాలను పారబోస్తున్న వ్యాపారులు

ఏయూక్యాంపస్: వ్యాపారులు ఏయూ స్థలాలను ఇష్టారాజ్యంగా వినియోగించుకుని.. వ్యర్థాలకు నిలయంగా మార్చేస్తున్నారు. శివాజీపాలెంలోని మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రహరీని ఆనుకుని ఉన్న పలు స్క్రాప్ దుకాణదారులు ఈ స్థలాలను తమకు ఉపయుక్తంగా మార్చుకుంటున్నారు. ఏయూ ప్రహరీపై నుంచి రేకులు వేయడం, వారు కొనుగోలు చేసిన స్క్రాప్ వస్తువులను ఏయూ లోపల నిల్వ చేస్తున్నారు. చాలా కాలంగా ఇదే తంతు జరుగుతోంది. గతంలో ప్రిన్సిపాల్, ఇంజినీరింగ్ సిబ్బందితో వెళ్లి స్క్రాప్ దుకాణ నిర్వాహకులకు వ్యర్థాలను తొలగించాలని హెచ్చరించారు. తూతూ మంత్రంగా అప్పుడు తొలగించిన దుకాణదారులు.. యథావిధిగా వ్యర్థాలను పారబోస్తున్నారు. తాజాగా మంగళవారం ఏయూ ఇంజినీర్లు రహదారిపై వెళుతూ.. భారీగా వ్యర్థాలు ఏయూ స్థలంలో వేయడాన్ని గమనించారు. సంబంధిత షాప్ నిర్వాహకులతో మాట్లాడి.. వెంటనే స్క్రాప్‌ను తొలగించాలని ఆదేశించారు.

ఆకతాయిలతో విద్యార్థినులకు ఇబ్బందులు

ఇదే రహదారిలో ఏయూ మహిళా కళాశాల ప్రహరీని ఆనుకుని పలువురు వ్యాపారస్తులు యథేచ్ఛగా వ్యాపారాలు చేయడం, ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన కార్లు అడ్డంగా నిలిపి వేయడం పరిపాటిగా మారింది. పలువురు ఆకతాయిలు సాయంత్రం వేళల్లో ఇక్కడకు చేరి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పక్కనే ఉన్న హాస్టల్‌లో ఉండే విద్యార్థినులు, కళాశాలలకు వచ్చే విద్యార్థినులకు ఇబ్బందికరంగా మారింది. జీవీఎంసీ, పోలీసు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


ఏయూ స్థలంలో వేసిన వ్యర్థాలు

టిప్పర్ ఢీ కొని వ్యక్తి దుర్మరణం

పీఎంపాలెం: పరదేశిపాలెం కూడలికి సమీపంలో జాతీయ రహదారిపై టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో బైకిస్ట్ మృతి చెందాడు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటరావు తెలిపిన వివరాలివీ.. పరదేశిపాలెంలో కుటుంబంతో సుంకరి నాగరాజు (38) నివసిస్తున్నాడు. అతను కూలి పనులు చేస్తుంటాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి తన ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. పరదేశిపాలెం నుంచి జాతీయ రహదారిపైకి ఎక్కుతుండగా నగరం వైపు నుంచి ఆనందపురం వైపునకు వెళుతున్న టిప్పర్ లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అదే క్రమంలో టిప్పర్ లారీ ముందు వెళుతున్న కంటైనర్ వాహనాన్ని కూడా ఢీకొట్టడంతో అదుపు తప్పి తుప్పల్లోకి దూసుకు పోయింది. విద్యుత్ స్తంభంను ఢీకొట్టి ఆగింది. అపస్మారకస్థితిలో ఉన్న క్షతగాత్రుడిని కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. నాగరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతని బంధువు పి.సాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్

మహారాణిపేట : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మంగళవారం వినతులు స్వీకరించారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో వివిధ కేడర్లలో పని చేస్తున్న స్టాఫ్ నర్సులు, పారా మెడికల్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు తమను రెగ్యులర్ చేయాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగుల్లా మినిమం టైం స్కేల్ అమలు చేయాలని అధికారులను కోరారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు దీనిపై సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులకు పంపి న్యాయం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ ప్రెసిడెంట్ శశిభూషణ్, వైస్ ప్రెసిడెంట్ ఆర్.సురేష్, సెక్రటరీ వీరబ్రహ్మం, గోపీనాథ్, నాగరాజు, పీటీవీ సత్యనారాయణ, కె.వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు